UTF

# ఆం.ప్ర. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

# A.P.UNITED TEACHERS' FEDERATION

Ph No: **27677242** Fax No: **27650366** **email: aputf2000@yahoo.com**

**ప్రచురణార్థం**

తేది: 06.09.2011

## అప్రెంటిస్ రద్దు చేసి, 2008 డిఎస్‌సి టీచర్లకు పూర్తి జీతాలు చెల్లించాలని కోరుతూ

# యుటియఫ్ నిరవధిక నిరాహారదీక్ష

## ప్రారంభించిన చుక్కా రామయ్య- సంఘీభావం తెల్పిన జెఏసి ఛైర్మన్ వి. గోపాలరెడ్డి

అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేసి, డిఎస్‌సి 2008లో ఎంపికైన 48 వేలమంది అప్రెంటిస్ టీచర్లకు వారి నియామకపు తేదీ నుండి టైం స్కేలులో పూర్తి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. నారాయణ, కృష్ణా, గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వై. శ్రీవాసులురెడ్డి హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌వద్ద నిరవధిక నిరాహారదీక్ష చేపట్టారు. వీరికి మద్దతుగా 300 మంది ఉపాధ్యాయులు రిలేనిరాహారదీక్షలో పాల్గొన్నారు.

మంగళవారం ఉదయం 11 గంటలకు పిడిఎఫ్ ఛైర్మన్, ప్రముఖ విద్యావేత్త చుక్కారామయ్య దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా జెఏసి ఛైర్మన్ వి. గోపాలరెడ్డి హాజరయ్యారు. యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు పి. బాబురెడ్డి అధ్యక్షతన నిర్వహించిన శిబిరంలో ఎమ్మెల్సీ రామయ్య మాట్లాడుతూ అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశ పెట్టి ప్రభుత్వం ఉపాధ్యాయ వృత్తిని అగౌరపరుస్తుందన్నారు. అప్రెంటిస్ టీచర్లకు పూర్తి జీతాలివ్వమంటే ప్రభుత్వం ఆర్థిక భారం అంటుందని కానీ గత 16 సంవత్సరాల నుండి అప్రెంటిస్ పేరిట ఉపాధ్యాయుల నుండి మిగుల్చుకున్న డబ్బుపై వడ్డీతోనే 2008 డిఎస్‌సి టీచర్లకు పూర్తిజీతాలు చెల్లించవచ్చని స్పష్టం చేశారు. పీఆర్‌సీ కమీషనర్ స్పష్టంగా సిఫారసు చేసినా, ప్రభుత్వం అమలు జరపకపోవటం పట్లఅభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజ్ఞత ప్రదర్శించి జనవరి 23న జెఏసితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేసి కీర్తి సంపాదించుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం కోసం నిరాహారదీక్షకు పూనుకున్న యుటియఫ్ అధ్యక్షు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలను అభినందించారు. తొలుత నారాయణ, లక్ష్మణరావు, శ్రీనివాసులురెడ్డిలకు పూలదండలువేసి అభినందనలు తెలిపారు.

జెఏసి ఛైర్మన్ వి. గోపాలరెడ్డి దీక్షనుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జెఏసి అగ్రిమెంటును చులకన చేస్తే సహించేది లేదన్నారు. జనవరి 23న జెఏసితో జరిగిన ఒప్పందంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రెంటిస్ రద్దుకు వ్రాతపూర్వకంగా అంగీకరించిందన్నారు. కానీ జెఏసి ఒప్పందానికి ప్రభుత్వం వక్రభాష్యం చెబుతూ అప్రెంటిస్ రద్దు వచ్చే డిఎస్‌సి నుండి అమలు జరపుతామని చెప్పడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జెఏసీ సర్వీస్‌లో వున్న ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. యుటియఫ్ నిర్వహిస్తున్న పోరాటానికి జెఏసిగా పూర్తి మద్దతును ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. జెఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ పి. అశోక్‌బాబు మాట్లాడుతూ అప్రెంటిస్ సమస్య పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలన్ని ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు.

యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. నారాయణ మాట్లాడుతూ అప్రెంటిస్ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. 16 సం॥లుగా ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న పోరాటాలకు పరాకాష్టగా ఉధృతం చేయాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఈ పోరాటంలో కలిసిరావాలన్నారు. ఐక్యంగా రాలేకపోతే విడిగానైనా ఎవరి స్థాయిల్లో వారు చిత్తశుద్ధితో పోరాటం నిర్వహించాలని అప్పుడే ప్రభుత్వం మెడలు వంచి అప్రెంటిస్ రద్దు చేయిచగలుగుతామని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా శాసనమండలిలో పోరాటం సాగించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లనే ప్రత్యక్ష పోరాటంలోకి రావాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం సమస్య పరిష్కారం చేసేవరకు దీక్ష విరమించేది లేదన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వై. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ 2008 డిఎస్‌సి ఉపాధ్యాయులందరికీ పూర్తి జీతాలు చెల్లించి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్లగల గౌరవాన్ని ప్రదర్శించుకోవాలని సూచించారు.

జెఏసి కో–ఛైర్మన్ ఎం. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ జి.ఓ.నం.3 ప్రకారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడ పోస్ట్ యొక్క కనీస వేతనాన్ని జీతంగా చెల్లిస్తుండగా అప్రెంటిస్ టీచర్లకు కేవలం 3600 చెల్లించటం అమానుషం అన్నారు. యుటియఫ్ ప్రధానకార్యదర్శి ఐ. వెంకటేశ్వర రావు, యుటియఫ్ గౌరవాధ్యక్షుడు సిహెచ్. సుభాస్‌చంద్రబోస్, సహాధ్యక్షులు ఎం. సంయుక్త, కోశాధికారి పి. మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. రవి, ఎం.ఏ.కె. దత్తు, టి. లక్ష్మారెడ్డి, రమణయ్య శాస్త్రి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయ సంఘం నాయకులు రవిచంద్ర, జెఏసి నాయకులు పి.వి.వి. సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి తదితరులు ప్రారంభ సమావేశంలో పాల్గొన్నారు.

**(ఎన్. నారాయణ)**
అధ్యక్షులు

**(ఐ. వెంకటేశ్వర రావు)**
ప్రధానకార్యదర్శి